క్లుప్తంగా

విద్యుత్ సమస్య పరిష్కారం



సాక్షి స్పందన

నల్లబెల్లి : మండలంలోని ధర్మారావుపల్లిలో విద్యుత్ వైర్లు వేలాడుతుండగా రైతు కర్ర స్తంబాన్ని ఏర్పాటు చేసుకోగా 'కర్ర'ంటు స్తంభాలే దిక్కు శీర్షికతో నేడు (శనివారం) ప్రచురితమైన కథనానికి ఎన్పీడీసీఎల్ అధికారులు స్పందించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇన్చార్జ్ ఏఈ రాజు పర్యవేక్షణలో లైన్మెన్ రాజు, అన్మెన్ వర్కర్ కారంపూడి సత్యనారాయణ సిబ్బందితో కలిసి ధర్మరావు పేటలోని ఐలయ్య పొలం వద్ద స్టే వైర్ ఏర్పాటు చేసి విద్యుత్ సమస్యను శుక్రవారం పరిష్కరించారు. లూజ్‌గా ఉన్న విద్యుత్ వైర్లను సరిచేశారు. ఈ సందర్భంగా రైతులు ఇన్చార్జ్ ఏఈ రాజుతోపాటు సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

ఎంపీ కావ్యకు సన్మానం



రాయపర్తి (వర్ధన్నపేట) : వరంగల్ ఎంపీ కడియం కావ్యను కాంగ్రెస్ పార్టీ వర్ధన్నపేట పట్టణ కమిటీ అధ్యక్షుడు మైన సురేశ్‌కుమార్ ఆధ్వర్యంలో నాయకులు శనివారం శాలువాతో సన్మానించారు. తొలుత ఎంపీ కావ్యతోపాటు స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిని నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఐత ప్రవీణ్‌కుమార్, చీటూరి రాజు, లింగం రజితరెడ్డి, పాక సుజాత తదితరులు పాల్గొన్నారు.

'కుడా' చైర్మన్‌కు..



సంగెం : కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ (కుడా) చైర్మన్ ఇనుగాల వెంకట్రామ్‌రెడ్డిని కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు శనివారం శాలువాతో సన్మానించారు. తొలుత ఆయనను మర్యాదపూర్వకంగా కలుసుకుని పూలబొకే అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మునుకుంట్ల కోటేశ్వర్, మోహన్, నల్లతీగల రవి, పులి సాంబయ్య, గుళ్లపల్లి సురేందర్, గోలి రాజు పాల్గొన్నారు.

నివాళి




నర్సంపేట : పట్టణంలోని ఒకటో వార్డుకు చెందిన బేతి శివసాయి శనివారం మృతి చెందగా ఆయన మృతదేహానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు పెండెం రామానంద్, ఓబీసీ సెల్ చైర్మన్ ఓర్సు తిరుపతి, 14వ వార్డు కౌన్సిలర్ ఎలకంటి విజయ్, ఒకటో డివిజన్ ఇన్‌చార్జి లక్కర్సు రమేశ్, 13వ డివిజన్ ఇన్‌చార్జ్ శ్రీరామోజు మురళి, నాయకులు గొలపల్లి కిష్టయ్య, కమలాకర్, బిట్ల మనోహర్, శిరంశెట్టి రాజు, ఎస్.సతీశ్, బి.శివకృష్ణ, కందకట్ల నర్సయ్య, కొలిపాక శ్రీను, ఎరుకల రమేశ్, శీరంశెట్టి శరత్, భరత్, వెంకన్న, గొల్లపెల్లి శివ, తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లిలో..

రాయపర్తి (వర్ధన్నపేట) : వర్ధన్నపేట మండలంలోని కొత్తపల్లికి చెందిన నల్లతీగల సాయమ్మ శనివారం మృతి చెందగా ఆమె మృతదేహానికి పీఏసీఎస్ చైర్మన్ కొడగాని రాకేశ్ ఖన్నా పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.4 వేల సాయం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు జన్ను రాములు, శ్యాంరావు, రామారావు, రాజు, సాంబరాజు పాల్గొన్నారు.

పరామర్శ



ఖానాపురం : మండలంలోని ధర్మరావు పేటకు చెందిన కారోబార్ రాములు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబాన్ని వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శాఖమూరి హరిబాబు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యడ్ల జగన్‌మోహన్‌రెడ్డి శనివారం పరామర్శించారు. తొలుత మృతుని చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడు ముస్తఫా, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కొనకటి రాజు, నాయకులు వీరమనేని సాగర్‌రావు, లింగాల మల్లికార్జున్, తదితరులు పాల్గొన్నారు.

'కోపాకుల' సాగు నీటి వృథా

- కట్టపై నిలిచిన అభివృద్ధి పనులు
- ఐబీ అధికారుల నిర్లక్ష్యం

చెన్నారావుపేట : వర్షాకాలం ప్రారంభమై రెండు నెలలు కావస్తోంది. ఆశించిన మేరకు వర్షాలు కురవడం లేదు. అడపదడపా వర్షాలు పడుతున్నా మండలంలోని కోపాకుల చెరువులోకి వచ్చిన సాగుకు ఉపయోగపడాల్సిన నీరు తూము నుంచి వృథా పోతోన్న దుస్థితి నెలకొంది. సమస్యను పలుమార్లు ఐబీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోకపోతుండడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చెరువు కింద 490 ఎకరాలు సాగు అవుతోంది. ఐబీ అధికారులు వెంటనే నీటి వృథాను అరికట్టకపోతే పంటకాలం ప్రశ్నార్థకంగా మారే ప్రమాదం ఉందని రైతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నిలిచిపోయిన అభివృద్ధి పనులు

కోపాకుల చెరువు మండలంలోనే ఏకైక పెద్ద చెరువు. చెరువు అభివృద్ధి, రివిట్‌మెంట్ పనుల కోసం రూ.13 లక్షలు మంజూరైన విషయాన్ని ఐబీ ఏఈ సురేశ్ నిర్ధారించారు. కాగా కట్టపై పనులు నామమాత్రంగా చేపట్టిన దుస్థితి నెలకొంది. రివిట్‌మెంట్ పనులు సైతం సగంలోనే ఆపేశారు. ఈ క్రమంలో కట్ట మీద నుంచి రాకపోకలు సాగించాలన్నా రైతులు బెంబేలెత్తుతున్నారు. వర్షం నీటితో కట్టకు కోతలు ఏర్పడ్డాయి. ఇకనైనా ప్రభుత్వం, ఐబీ అధికారులు స్పందించి సదరు కాంట్రాక్టర్‌తో కట్ట మరమ్మతు, రివిట్‌మెంట్ నాణ్యతతో పనులు త్వరగా పూర్తి చేయించాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.



కోపాకుల చెరువు (ఇన్‌సెట్‌లో) తూము నుంచి వృథాగా పోతున్న సాగునీరు

నీటి వృథాను అరికట్టాలి



తూము నుంచి నీటి వృథాను వెంటనే అరికట్టాలి. కాల్వలకు మరమ్మతు చేయడం లేదు. కట్టపై చేపట్టిన అభివృద్ధి పనులు మధ్యలోనే ఆపేశారు. రివిట్‌మెంట్ పనులు పూర్తి చేయాలి. కట్టపై నాణ్యతతో పనులు పూర్తి చేయాలి. వెంటనే తూము నుంచి సాగు నీరు వృథా పోకుండా మరమ్మతులు చేపట్టాలి.

-కుసుమ నరేందర్, ఆయకట్టు రైతు

అత్యవసర నిధులు.. అయినా జాప్యం



కోపాకులు చెరువు కట్ట మరమ్మతుల పనులు అత్యవసర నిధులతో ప్రారంభించారు. అయినా పనులు ఎక్కడకక్కడే నిలిచిపోయాయి. ప్రభుత్వం, ఐబీ శాఖ ఉన్నతాధికారులు స్పందించాలి. కట్ట అభివృద్ధి పనులు పరిశీలించి నాణ్యతతో చేపట్టేలా చర్యలు తీసుకోవాలి. తక్షణమే తూముకు మరమ్మతు చేయించి నీటి వృథాను అరికట్టాలి.

-అల్లాడి భాస్కర్, ఆయకట్టు రైతు

మొక్కలు నాటి సంరక్షించండి

- బీజేపీ పరకాల నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ విజయ్‌చందర్‌రెడ్డి

గీసుకొండ : బీజేపీ నాయకులు, కార్యకర్తలు మొక్కలు నాటి సంరక్షించాలని ఆ పార్టీ పరకాల నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ పెసరు విజయ్‌చందర్‌రెడ్డి కోరారు. 'మా కే నామ్ పే ఏక్ పేడ్' కార్యక్రమంలో భాగంగా పార్టీ నేత డాక్టర్ కాళీప్రసాద్‌రావుతో కలిసి మండల కేంద్రంలోని కాటమయ్య ఆలయంలో విజయ్‌చందర్‌రెడ్డి శనివారం మొక్క నాటి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం, బీజేపీ అధిష్టానం దేశ సమగ్ర అభివృద్ధికి పాటు పడుతున్న క్రమంలోనే తల్లి పేరిట ఒక మొక్క నాటాలని ప్రధాని పిలుపు నిచ్చారని చెప్పారు. అనంతరం డాక్టర్ కాళీప్రసాద్ మాట్లాడారు. శ్రేణులు మొక్కలు నాటి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని చెప్పారు. కార్యక్రమంలో ఆ పార్టీ పరకాల నియోజకవర్గ కన్వీనర్ ముల్క ప్రసాద్, మండల అధ్యక్షుడు జాన్ విక్రమ్, జిల్లా కార్యదర్శి మొలుగూరి శ్రీనివాస్, కోశాధికారి పగడాల రాజ్‌కుమార్, నాయకులు కూతురు రాజు, రాజిరెడ్డి, కత్తి రమేశ్, వెంకటేశ్వర్లు, ప్రదీప్, రాజు తదితరులు పాల్గొన్నారు.



మొక్క నాటుతున్న విజయ్‌చందర్‌రెడ్డి, నాయకులు

ఐక్యఉద్యమాలతోనే రిజర్వేషన్ సాధన

- మెపా వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు దేవేందర్

సంగెం : ఐక్యఉద్యమాల ద్వారానే రిజర్వేషన్‌ను సాధించుకోగలమని ముదిరాజ్ ఎంప్లాయీస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (మెపా) వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్ స్పష్టం చేశారు. మండలంలోని నల్లబెల్లిలో మత్స్య శాఖ గ్రామ కమిటీ చైర్మన్ నీరటి రాజు అధ్యక్షతన శనివారం నిర్వహించిన సమావేశానికి దేవేందర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు ముదిరాజ్ కులస్తులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్‌చేశారు. హక్కుల సాధన, సమస్యల పరిష్కారం కోసం ముదిరాజ్ సంఘాలు ఐక్యంగా ఉద్యమించాలని సూచించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ముదిరాజ్ కులస్తులు సత్తా చాటాలని కోరారు. అనంతరం డిమాండ్లపై నినాదాలు చేశారు. కార్యక్రమంలో నాయకులు నీరటి సూరయ్య, సారంగం, సమ్మయ్య, సంపత్, ఐలయ్య, రాజు, సుధాకర్, ఎల్లయ్య, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న దేవేందర్

నైపుణ్యాలతో బంగారు భవిష్యత్‌కు బాటలు

- చైర్మన్ డాక్టర్ రాజేంద్రపసాద్‌రెడ్డి

నర్సంపేట రూరల్ : నైపుణ్యాలు పెంచుకుంటే బంగారు భవిష్యత్‌కు బాటలు పడతాయని బాలాజీ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ రాజేంద్రప్రసాద్‌రెడ్డి తెలిపారు. నర్సంపేట మండలంలోని లక్నేపల్లి శివారులోని బాలాజీ ఎంబీఏ కళాశాలలో శనివారం నిర్వహించిన ఫేర్‌వెల్ పార్టీకి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ద్వితీయ సంవత్సర విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలని, జూనియర్లకు మార్గదర్శకులుగా నిలవాలని ఆకాంక్షించారు. బిమ్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సంపత్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో ముందుకు సాగాలని సూచించారు. తొలుత విద్యార్థులు నృత్యాలు, ఫన్నీ గేమ్స్, పాటలతో అలరించారు. కార్యక్రమంలో బాలాజీ విద్యాసంస్థల సెక్రెటరీ డాక్టర్ రాజేశ్వర్‌రావు, బిట్స్ ప్రిన్సిపాల్ హరిహరన్, అకడమిక్ కోఆర్డినేటర్ నారాయణ, మేనేజ్‌మెంట్ కళాశాల విభాగాధిపతులు నరేశ్, గోపీకృష్ణ, ఏఓ సురేశ్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సంపత్

కొమ్మాలలో 'కుడా' చైర్మన్ పూజలు



వెంకట్రాంరెడ్డికి వినతిపత్రం ఇస్తున్న ఈఓ శేషగిరిరావు, తదితరులు

గీసుకొండ : మండలంలోని సుప్రసిద్ధ కొమ్మాల లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ (కుడా) చైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి శనివారం ప్రత్యేక పూజలు చేశారు. అయనకు అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వెంకట్రాంరెడ్డిని కాంగ్రెస్ నాయకులు శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించి స్వాగతం పలికారు. ఆలయ దారిలో నాలుగు చోట్ల కుడా నిధులతో హైమాస్ లైట్లు ఏర్పాటు చేయాల్సిన విషయాన్ని ఆలయ ఈఓ శేషగిరిరావు, కాంగ్రెస్ నాయకులు వెంకట్రామిరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పరకాల నియోజకవర్గ అధికార ప్రతినిధి చాడ కొమురారెడ్డి, మాజీ ఎంపీపీ బీమగాని సౌజన్య, పార్టీ మండల అధ్యక్షులు తుమ్మనపెల్లి శ్రీనివాస్, సాయి, ఆలయ ధర్మకర్త చక్రవర్తుల శ్రీనివాసాచార్యులు, రామాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల పక్కనే చెత్తాచెదారం



పర్వతగిరి : మండల కేంద్రంలోని పలు ప్రాంతాల్లో రోడ్ల పక్కనే చెత్తాచెదారం కనిపిస్తోంది. పలు బిర్యానీ సెంటర్లు, చికెన్ దుకాణాల నిర్వాహకులు వ్యర్థాలను ప్రతీరోజు రోడ్డు పక్కనే పడేస్తున్నారు. మండల కేంద్రం నుంచి నెక్కొండకు వెళ్లే దారి పక్కనే డంపింగ్ యార్డును తలపించేలా చెత్తాచెదారం ఉండడంతో ఆ రోడ్డు మీదుగా రాకపోకలు సాగించే వాహనదారులు, ప్రజలు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండల కేంద్రంలోని పలు బిర్యానీ సెంటర్ల యజమానులు చెత్తాచెదారాన్ని ఇష్టారీతిన ఎక్కడపడితే అక్కడే పడేస్తున్నారంటూ పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు. చెత్తాచెదారం కంపు కొడుతుండడంతో ప్రజలు దుర్వాసనతో సతమతమవుతున్నారు. ప్రభుత్వం, సంబంధిత శాఖ అధికారులు రోడ్లపై చెత్త వేస్తున్న వ్యాపారస్తులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి

చెన్నారావుపేట : విద్యుదాఘాదంతో పాడి గేదె మృతి చెందిన ఘటన మండలంలోని తిమ్మరాయినిపహాడ్‌లో శనివారం చోటు చేసుకుంది. స్థానికుల, బాధిత రైతు కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన మదమంచి సత్యవతికి చెందిన పాడి గేదెలు మేత కోసం గ్రామ శివారులోకి వెళ్లాయి. ఈ క్రమంలో ఒక గేదె ప్రమాదవశాత్తు ట్రాన్స్‌ఫార్మర్ వద్ద తెగిపడిన విద్యుత్ తీగకు తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం అందించడంతో సరఫరా నిలిపివేశారు. అనంతరం డాక్టర్ రశీద్, జేఎల్ఎం మహేశ్‌లతో కలిసి పశు వైద్యాధికారి డాక్టర్ మంజీలాల్ గేదెకు పోస్ట్‌మార్టం నిర్వహించారు. గేదె విలువ సుమారు రూ.90 వేలు ఉంటుందని బాధిత రైతు వాపోయింది. ప్రభుత్వం, విద్యుత్ శాఖ తనకు పరిహారం అందించి ఆదుకోవాలని ఆమె కోరుతోంది.

ఎన్నికల హామీలు అమలు చేయండి

- మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అశోక్

నర్సంపేట : కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ముదిరాజ్‌మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లెబోయిన అశోక్, జిల్లా అధ్యక్షుడు పొన్నం మొగిలి, ఎన్ఆర్ఐ విభాగం రాష్ట్ర ఇన్‌చార్జ్ శానబోయిన రాజ్‌కుమార్, డివిజన్ అధ్యక్షుడు జినుకల కొమ్మాలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈనెల 15 నుంచి తలపెట్టిన కార్యాచరణకు సంబంధించిన వాల్ పోస్టర్లను పట్టణంలో శనివారం వారు ఆవిష్కరించి మాట్లాడారు. ముదిరాజ్ కులస్తులకు చేపపిల్లలు పంపిణీ చేసే బదులు నగదు బదిలీ చేస్తే మరింత ప్రయోజనం కలుగుతుందని చెప్పారు. ముదిరాజ్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేసి వెయ్యి కోట్ల రూపాయలు కేటాయించాలని, చెరువులతోపాటు కుంటలపై సంపూర్ణ హక్కులు కల్పించాలని, ముదిరాజ్ కులానికి చెందిన నాయకులకు మంత్రి పదవి కల్పించాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మత్స్య సొసైటీ జిల్లా చీఫ్ ప్రమోటర్ చొప్పరి సోమయ్య, మహాసభ జిల్లా ప్రధాన కార్యదర్శి నీరటి సదానందం, జిల్లా నాయకులు గుంటుక సోమయ్య, గోనెల నరహరి, వివిధ మండలాల అధ్యక్షులు నూనె నర్సయ్య, దామ సాంబయ్య, తోట సాంబయ్య, పల్లె రమేశ్, నాయకులు కీసరి వెంకటేశ్వర్లు, నాయిని వేణుచంద్, డ్యాగల కిరణ్, మాటం రవి, బొల్ల స్వామి, పెండ్యాల సారయ్య పాల్గొన్నారు.



నర్సంపేట:వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

పర్వతగిరి : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు ముదిరాజ్ కులస్తులను బీసీ–డీ నుంచి బీసీ–'ఏ'లోకి మార్చాలని ముదిరాజ్ మహాసభ మండల అధ్యక్షుడు కొత్తూరు రామ్మోహన్ డిమాండ్ చేశారు. ఈనెల 15 నుంచి తలపెట్టిన కార్యాచరణ వాల్‌పోస్టర్లను మండల కేంద్రంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు నీరటి వెంకన్న అధ్యక్షతన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రామ్మోహన్ మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా మత్స్య శాఖ డైరెక్టర్ అల్లాడి నర్సయ్య, ముదిరాజ్ మహాసభ యువజన విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి గుండా రాకేశ్, నాయకులు పిట్టల రాజు, తదితరులు పాల్గొన్నారు.

'ప్రైవేట్'లో యథేచ్ఛగా నిబంధనల ఉల్లంఘన

- పేరెంట్స్ కమిటీల ఏర్పాటులో నిర్లక్ష్యం
- తరగతి గదుల్లో పరిమితికి మించి విద్యార్థులు

పర్వతగిరి : మండలంలోని పలు ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు యథేచ్ఛగా నిబంధనలు ఉల్లంఘిస్తున్నాయన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పేరెంట్స్ కమిటీల ఏర్పాటులో నిర్లక్ష్యం రాజ్యమేలుతుండగా తరగతి గదుల్లో పరిమితికి మించి విద్యార్థులుంటున్నారు. గడచిన పదేళ్లల్లో విద్యాశాఖ అధికారులు ఒక్కసారి కూడా తనిఖీ చేయలేదని పలువురు బహిరంగంగానే మండిపడుతున్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తున్న పాఠశాలల యాజమాన్యాలకు మండల విద్యావనరుల కేంద్రం ఉద్యోగులు అండగా ఉంటున్నారన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. నిబంధనల ప్రకారం పాఠశాలలకు అనుమతులు, పేరెంట్స్ కమిటీ, పాఠశాలల్లో పచ్చదనం, పరిశుభ్రత, క్రీడా ప్రాంగణం, టాయిలెట్ల శుద్ధీకరణ, తదితర అంశాలపై విద్యాశాఖ పని చేయాల్సి ఉంది. పదేళ్లుగా మండలంలోని కొన్ని ప్రైవేట్ స్కూళ్లలో విద్యా కమిటీలు వేయలేదు. పలు స్కూళ్ల ల్లో నామమాత్రంగా కమిటీలు వేసి విద్యాశాఖకు పంపిస్తున్నట్టు తెలుస్తోంది. అలాంటి పాఠశాలల యాజమాన్యాలకు మండల విద్యావనరుల కేంద్రంలోని కొందరు ఉద్యోగులు అండగా నిలుస్తున్నట్టు సమాచారం.

ఒక్కో గదిలో 80 మంది విద్యార్థులు

ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఒక్కో తరగతి గదిలో 30 మందికి మించి విద్యార్థులు ఉండకూడదు. అయినా నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ తరగతి గదుల్లో సుమారు 60 నుంచి 80 మంది చొప్పున విద్యార్థులను ఒక్కో తరగతి గదిలో ఉంచి బోధిస్తుండడంపై విద్యార్థుల తల్లిదండ్రులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. పలు పాఠశాలల్లో క్రీడా ప్రాంగణాలు లేని దుస్థితి నెలకొంది. అయినా చర్యలు తీసుకోవడంలో విద్యాశాఖ వెనుకడుగు వేస్తోందని విమర్శలున్నాయి.

పాఠ్యపుస్తకాలు, యూనిఫాం విక్రయం

పలు ప్రైవేట్ పాఠశాలలు పాఠ్యపుస్తకాలు, యూనిఫాం అధిక ధరలకు విక్రయిస్తున్నా విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవడం లేదని పలువురు బహిరంగంగానే మండిపడుతున్నారు. పుస్తకాలను ఎమ్మార్పీ మీద 35 నుంచి 45 శాతం అధిక ధరతో విద్యార్థులకు అంటగడుతున్నారని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. యూనిఫారాలకు సైతం భారీగా డబ్బు వసూలు చేస్తున్నా నాసిరకం దుస్తులు అందజేస్తున్నట్టు తెలుస్తోంది.



మండల విద్యావనరుల కార్యాలయం

ఫీజుల నియంత్రణపై చర్యలు శూన్యం

ప్రైవేట్ పాఠశాలల్లో నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ విద్యార్థులకు రూ.4–5 వేల ఫీజు ఉండాల్సి ఉండగా పలు యాజమాన్యాలు రూ.13 వేల నుంచి రూ.15 వేల వరకు దండుకుంటున్న దుస్థితి నెలకొంది. దూరప్రాంత విద్యార్థులకు వ్యాన్ సౌకర్యం ఏర్పాటుకు రూ.5 వేలు నెలకు వసూలు చేస్తున్నారు.

పాఠశాలలపై పర్యవేక్షణ కొరవడింది



ప్రైవేట్ పాఠశాలలపై అధికారుల పర్యవేక్షణ కొరవడింది. పేరెంట్స్ కమిటీలు వేయడంలో విద్యాశాఖ పూర్తిగా విఫలమైంది. పలు ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు నిబంధనలను ఇష్టారీతిన ఉల్లఘిస్తున్నాయి. ఫీజుల నియంత్రించడంలోనూ అధికారులు పట్టించుకోవడం లేదు.

-బి.కుమార్, విద్యార్థి తండ్రి, గోరుగుట్టతండా

అతిక్రమిస్తే చర్యలు తప్పవు



ప్రైవేట్ పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు. పేరెంట్స్ కమిటీల ఏర్పాటు, పుస్తకాలు, యూనిఫారాల విక్రయాలను జిల్లా విద్యాధికారి (డీఈఓ) దృష్టికి తీసుకెళ్తా. ఐదు మండలాలకు ఇన్‌చార్జ్‌గా ఉండడంతో పని చేస్తుండడంతో పాఠశాలలను తనిఖీ చేయడంలో జాప్యం జరుగుతోంది.

-చదువుల సత్యనారాయణ, ఎంఈఓ

రేవూరికి మంత్రి పదవి ఇవ్వాలి



పూజ చేస్తున్న కొమురారెడ్డి, నాయకులు

గీసుకొండ : పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డికి రానున్న విస్తరణలో మంత్రి పదవి ఇవ్వాలని ఆకాంక్షిస్తూ కాంగ్రెస్ పార్టీ నాయకులు మండలంలోని కొమ్మాల గ్రామంలోని లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ పరకాల నియోజకవర్గ అధికార ప్రతినిధి చాడా కొమురారెడ్డి మాట్లాడారు. సుదీర్ఘ రాజకీయ అనుభవం కలిగిన ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డికి మంత్రివర్గంలో స్థానం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు వాంకుడోతు గోపాల్, కూస రమేశ్, దూల వెంకటేశ్వర్లు, ప్రభాకర్, హలావత్ వీరన్న, వీరాటి రవీందర్‌రెడ్డి, మంద రమేశ్, తాటికొండ నరేందర్, నల్ల సురేశ్, సతీశ్ నాగబాబు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణిస్తే ఉద్యోగ అవకాశాలు

తొర్రూరు: క్రీడల్లో రాణిస్తే ఉద్యోగ అవకాశాలు ఉంటాయని భారత వాలీబాల్ జట్టు మాజీ కెప్టెన్ కన్నా వెంకటనారాయణ అన్నారు. డివిజన్ కేంద్రానికి శనివారం వచ్చిన సందర్భంగా ఆయనను వాలీబాల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వెంకటనారాయణ మాట్లాడారు. వాలీబాల్ క్రీడలో రాణించేందుకు అవసరమైన మెలకువలను తెలిపారు. వాలీబాల్ బాల్‌లను విరాళంగా అందజేశారు. క్రీడల్లో యువత రాణించేలా ప్రోత్సాహం కల్పించాలని సూచించారు. ఉపాధ్యాయులు, ఉద్యోగులు నిత్య జీవితంలో వాలీబాల్ క్రీడను భాగంగా చేసుకోవాలన్నారు. క్రీడలో రాణిస్తే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దక్కుతాయన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు గొడిశాల నగేష్, ప్రధాన కార్యదర్శి దేవులపల్లి శంకర్, పీడీ వాసిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి, ప్రతినిధులు నాగరాజు, నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సై ఆత్మహత్య కారకులను శిక్షించాలి



నల్లబెల్లి : అశ్వరావుపేట ఎస్సై శ్రీరాముల శ్రీను ఆత్మహత్యకు కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని ప్లంబర్ అసోసియేషన్ రాష్ట్ర నాయకుడు జమ్మల నాగరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని నారక్కపేటలో శ్రీను కుటుంబాన్ని నాగరాజు ఆధ్వర్యంలోని బృందం శనివారం పరామర్శించింది. అనంతరం నాగరాజు మాట్లాడారు. దళిత సామాజికవర్గానికి చెందిన నేపథ్యంలో ఎస్సై అయినప్పటికీ శ్రీనును అగ్రవర్ణాలకు చెందిన సీఐ, సిబ్బంది మానసిక వేధింపులకు గురి చేశారని తెలిపారు. నిందితులందరినీ కఠినంగా శిక్షించడంతోపాటు శ్రీను సతీమణికి సముచిత న్యాయం చేసేలా తగిన ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు.